ఈ-బైక్‌లపై మోజు

- ఇంధన ఖర్చు ఆదా. లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు
- 3 గంటల చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల వరకు ప్రయాణం
- రూ.60 వేల నుంచి వివిధ రకాల మోడళ్లలో లభ్యం


నగరంలోని ఓ షోరూంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌లు

విజయనగరం: పెట్రోల్ ధరలు సామాన్యుడికి భారంగా మారిన నేపథ్యంలో అధిక మంది ఎలక్ట్రికల్ బైక్‌ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంధనం, నిర్వహణ ఖర్చు ఆదా చేసుకునే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఈ-వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో రోజువారీ కార్యకలాపాల కోసం 20 నుంచి 30 కిలో మీటర్ల ప్రయాణించే వారందరూ ఇప్పుడు ఈ వాహనాల కొనుగోలుకే మొదటి ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో చిన్నచిన్న పట్టణాల్లో సైతం ఈ-వాహనాలు విక్రయించే షోరూమ్‌లు వెలుస్తున్నాయి. సుమారు పదికిపైగా కంపెనీలు ఈ-వాహనాలు తయారు చేస్తున్నాయి. రూ.60 వేల నుంచి రూ.లక్షా75వేల వరకు వివిధ రకాల మోడళ్లలో ఎలక్ట్రికల్ వాహనాలు లభ్యమవుతున్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు చార్జింగ్ పెడితే, సామర్థ్యాన్ని బట్టి 60 నుంచి 120 కిలోమీటర్ల వరకూ మైలేజీ వచ్చే వాహనాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. క్రమంగా గ్రామీణులు సైతం వీటిపై మక్కువ చూపుతున్నారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో వివిధ కంపెనీలకు చెందిన 10కి పైగా షోరూమ్‌లు వెలిశాయి. సాధారణంగా ఇంటి నుంచి ఆఫీసుకి వెళ్లి రావడం, పిల్లలను స్కూల్లో దింపి, సాయంత్రం తీసుకురావడానికి, పొలానికి వెళ్లి వచ్చేందుకు ఈ-వాహనాలు అనువుగా ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

రూ.10 ఖర్చుతో 60 నుంచి 120 కి.మీ ప్రయాణం

పెట్రోల్‌తో నడిచే వాహనం కొనాలంటే ఇప్పుడు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. అయినా ఇవి లీటర్ పెట్రోల్‌కు 35 నుంచి 70 కిలోమీటర్ల మైలేజ్ మాత్రమే ఇస్తున్నాయి. అదే ఈ-వాహనం అయితే యూనిట్ నుంచి యూనిటన్నర విద్యుత్‌చార్జి ఖర్చు రూ.10కే 60 నుంచి 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించే అవకాశం ఉంది. కేవలం కిలోమీటర్‌కు 15 నుంచి 20 పైసలలోపు ఖర్చవుతోంది. యూనిట్ కరెంట్ రేట్ రూ.6.50. ఈ లెక్కన ఎలక్ట్రికల్ బైక్ వినియోగిస్తే నెలకు రూ.300 లోపు కరెంటుకు ఖర్చవుతుంది. అదే పెట్రోల్ కోసం రూ.3 వేల వరకు ఖర్చు చేయాలి. పైగా ఈ-వాహనానికి బ్యాటరీ, మోటార్ మాత్రమే ఉంటాయి. దీంతో తక్కువగా రిపేర్లు వస్తాయి. రోజుకు వంద కిలోమీటర్లు తిరిగే వారికైతే దాదాపు రూ.10 వేల వరకు ఇంధన వ్యయం ఆదా అవుతుంది. పైగా ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం కూడా ఉండదని వాహనబోదకులు చెబుతున్నారు.

మహిళలకు సౌకర్యవంతం

ఉపాధిహామీ కోసం నగరంలోని బ్లౌజింగ్ సెంటర్ నిర్వహిస్తున్నా. గత ఆగస్టులో ఎలక్ట్రికల్ బైక్ కొనుగోలు చేశా. విద్యుత్ చార్జింగ్‌కు నెలకు రూ.300లకు మించి ఖర్చవడం లేదు. ఒకసారి చార్జింగ్ పెడితే 70 నుంచి 80 కిలోమీటర్ల వరకు మైలేజీ వస్తోంది. ఒక రోజు చార్జింగ్ పెడితే మూడు రోజుల పాటు వస్తోంది. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లి తిరిగి తీసుకువస్తా. ఇతర అవసరాలకు వాహనం వినియోగిస్తున్నాం. మహిళలకు సౌకర్యవంతంగా ఉంది.

– బి.భారతి, విజయనగరం

నెలకు రూ.3 వేలు ఆదా

గతంలో బైక్ పెట్రోల్‌కు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చయ్యేది. ఏడాది కిందట ఈ-వాహనం కొనుగోలు చేశాం. ఉదయాన్నే ఈ బైక్‌లోనే పిల్లలను స్కూల్‌లో దింపి, ఉద్యోగానికి వెళ్తుంటా. సాయంత్రం స్కూల్ నుంచి పిల్లల్ని తీసుకువస్తున్నా. పట్టణంలో ఏదైనా అవసరం ఉంటే ఈ-వాహనాన్ని వాడుతున్నాం. కరెంట్ బిల్లు నెలకు రూ.200 మాత్రమే పెరిగింది.

– కె.సురేష్, చిరుద్యోగి, విజయనగరం

ఊరికి ఉపకారి

- కన్న ఊరు, చదివిన బడి అభివృద్ధిలో భాగమైన ఉపాధ్యాయుడు రమణ
- చదువుకున్న బడిలోనే ఉపాధ్యాయుడిగా విధులు
- సొంత డబ్బులతో పాఠశాలలో అభివృద్ధి పనులు
- తల్లిదండ్రులను బాగా చూసుకునే వారికి మాతృశ్రీ సేవ పేరిట నగదు పురస్కారాలు


ఉపాధ్యాయుడు రమణ


బుదరాయవలస హైస్కూల్‌లో మధ్యాహ్నభోజనం వంటశాల వద్ద రమణ మాస్టారు నిర్మించిన రేకుల షెల్టర్



పాఠశాల సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం


పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం



పాఠశాల సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహం



బుదరాయవలసలో పైడితల్లిఅమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 'ఐ లవ్ బుదరాయవలస' నేమ్‌బోర్డు

మెరకముడిదాం: ఏ వ్యక్తి అయినా తనకు చేతనైన మేరకు జన్మనిచ్చిన గడ్డ రుణం తీర్చుకోవాలని పెద్దలు చెబుతుంటారు. ఆమాటలను మండలంలోని బుదరాయ వలస గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాడుగుల రమణ ఆచరణలో పెట్టారు. పుట్టి పెరిగిన ఊరు, చదువుకున్న బడిపై ఆయన మమకారం చాటుకున్నారు. జన్మనిచ్చిన ఊరు, చదుకున్న పాఠశాల కోసం ఎంత చేసినా తక్కువే అన్నది ఆయన అభిమతం. ఉపాధ్యాయుడు రమణ వివిధ పాఠశాలల్లో పనిచేశారు. తన సొంత గ్రామం బుదరాయవలసలోని తాను చదువుకున్న హైస్కూల్‌కే బదిలీపై వచ్చి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామంతో పాటు పాఠశాల అభివృద్ధికి తనవంతు బాధ్యత తీసుకున్నారు. తనకు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చిన వెంటనే గ్రామంలోని పాఠశాలలో రూ.25 వేలతో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదే పాఠశాలకు బదిలీపై వచ్చిన తర్వాత పాఠశాల ఆవరణలో రూ.30 వేలతో స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి రూ.75 వేలతో షెడ్ నిర్మించారు. రూ.15 వేలుతో పాఠశాలకు సౌండ్‌సిస్టమ్, మైక్ అందజేశారు. గ్రామంలో పైడితల్లి అమ్మవారి ఆల యం వద్ద ప్రధాన రహదారిని ఆనుకొని 'ఐ లవ్ బుదరా యవలస' అనే నేమ్ బోర్డును రూ.73 వేలు ఖర్చుచేసి ఏర్పాటు చేయించారు. పాఠశాలలో 10వ తరగతి విద్యా ర్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు.

మాతృశ్రీ సేవా పురస్కారం

గ్రామంలో తల్లిదండ్రులను బాధ్యతగా బాగా చూసుకునే వారికి మాతృశ్రీ సేవా పురస్కారం పేరిట ప్రతీ సంక్రాంతికి రూ.25 వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తు న్నారు. గ్రామంలో మూడు కుటుంబా లకు ప్రతినెలా నిత్యావసర సరుకులకు అయ్యే ఖర్చును రమణ మాస్టారే భరిస్తూ చేదోడుగా నిలుస్తున్నారు. ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ గ్రామస్తులతో మా మంచి మాస్టారు అని అనిపించుకుంటున్నారు రమణ.

క్లుప్తంగా

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరా


గుర్ల హైస్కూల్ ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ భానుప్రకాష్

గుర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశామని ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్‌లను మండల కేంద్రంలో బుధవారం అందజే శారు. పాఠశాలలు ప్రారంభించిన రోజున విద్యార్థులకు వాటిని పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎంఈఓ-2 శ్రీనివాసరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


మృతుడి భార్య సావిత్రికి బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్ జనార్దన్

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ బొర్రవలస గ్రామానికి చెందిన వంతు రమణ కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)పథకం కింద రూ.2లక్షల బీమా మంజూరైంది. వంతు రమణకు వేపాడ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లో ఖాతా ఉంది.ఆయన పీఎంజేజేబీవై పాలసీ తీసుకున్నారు. ఇటీవలే రమణ మరణించడంతో బీమా వర్తించింది. నామినీ అయిన ఆయన భార్య సావిత్రికి బీమా చెక్కును వేపాడలోని ఏపీజీవీబీలో మేనేజర్ జనార్దన్ బుధవారం అందజేశారు. ఈ సందర్భం గా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు జీపీఏ, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వంటి బీమా పథకా ల్లో చేరాలని సూచించారు. క్యాషియర్ రామారావు, వీలుపర్తి సీఎస్‌పీ త్రినాథమ్మ పాల్గొన్నారు.

నివాళి


పైడిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు సామంతులు పైడిరాజు ఇటీవల మరణించారు. ఆయన పెద్ద కర్మ కార్యక్రమాన్ని లోగిశ గ్రామంలో కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై పైడిరాజు చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ పైడిరాజు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. జెడ్పీటీసీ గార తవుడు, బెల్లాన త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను అంతం చేద్దాం

విజయనగరం పూల్‌బాగ్: డిస్ట్రిక్ట్ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్, ప్రజ్వల సంఘం, డీబీఎస్‌యూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం స్థానిక దళిత బహుజన శ్రామిక యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం! 'బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే నేరం' అనే గోడపత్రికను డిస్ట్రిక్ట్ చైల్డ్ రైట్స్ చైర్మన్ పి.చిట్టిబాబు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూరగాల చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు రాయిపల్లి శంకరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.చిట్టిబాబు మాట్లాడుతూ బాలకా ర్మికుల నిర్మూలన సామాజిక బాధ్యతగా పేర్కొన్నా రు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భా గంగా ప్రపంచంలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామని ప్రపంచ దేశాలు అంగీకరించాయని, అందులో భాగంగానే 2030 నాటికి బాలకార్మికులు లేని దేశంగా, బాల కార్మికులు లేని రాష్ట్రంగా, బాల కార్మికులు లేని జిల్లాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ పెద్ద సవాల్‌గా మారిందని, జనాభాలో అధిక శాతం ఉన్న బాల లు, వారి భద్రత ప్రమాదంలో ఉన్నట్టు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసిందన్నారు. బాలలకు ఇవ్వబడిన జీవించే హక్కు కాపాడాలని, బాలలను పనిలో పెట్టుకుంటే నేరమని, వారికి జైలు శిక్ష, జరిమానా విధించబడుతుందని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జూన్ 30 వరకు అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామ ని చెప్పారు. కార్యక్రమంలో డీబీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు, చైల్డ్ రైట్స్ రెస్పాన్స్ సొసైటీ అధ్యక్షులు పి.సత్యవతి, డొమెస్టిక్ ఫోరం కో ఆర్డినేటర్లు కె.వరలక్ష్మి, పోలయ్య, యు.రాము, ఎమ్.పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మికి పురస్కారం


అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మికి విజయనగరం రోటరీ క్లబ్ వారు ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం రాత్రి విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారికి రోటరీ క్లబ్ చైర్మన్ జగదీష్‌బాబు తదితరులు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్‌బాబు మాట్లాడుతూ వైద్య రంగంలో సామ్రాజ్యలక్ష్మి అందించిన ఉత్తమ సేవలకు ఈ పురస్కారం ప్రదానం చేశామని చెప్పారు. సామ్రాజ్యలక్ష్మి జామి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.నాగశ్వేత, హెల్త్ ఎడ్యూకేటర్ ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్‌ఓ ఫ్లోరెన్స్ తదితర సిబ్బంది అభినందనలు తెలిపారు.

4 రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు


కార్పొరేషన్ కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

విజయనగరం: ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి నగరానికి వచ్చే తాగునీటి పైప్‌లైన్‌ల అనుసంధాన పనుల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు బుధవారం తెలిపారు. నగరంలోని కంటోన్మెంట్, బాలాజీ నగర్, కొత్త అగ్రహారం, వీటి అగ్రహారం, ఉడాకాలనీ ప్రాంతాల్లోని రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో నిర్ణీత రోజుల్లో నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు. కొర్లాం జంక్షన్ నుంచి గొట్లాం వరకు నేషనల్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నూతన పైప్‌లైన్‌ల అనుసంధానం పనులు చేపడతామన్నారు. దీంతో కార్పొరేషన్ పరిధిలోని 37, 38, 39, 40, 41, 43, 44, 46, 47 డివిజన్లలో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామన్నారు. 16న 37వ వార్డులో ఉదయం 6 గంటలకు, 38వ వార్డులో 8:30కు, 39వ వార్డులో 11:30కు, 40వ వార్డులో మధ్యాహ్నం 2:30 గంటలకు, 41వ వార్డులో 4:30 గంటలకు నీటిని సరఫరా చేస్తామన్నారు. 17న 43వ వార్డులో ఉదయం 6 గంటలకు, 44వ వార్డులో 8:30కు, 46వ వార్డులో 11:30కు, 47వ వార్డులో 4:30 గంటలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామన్నారు. 18న 37వ వార్డులో ఉదయం 6 గంటలకు, 38వ వార్డులో 8:30కు, 39వ వార్డులో 11:30కు, 40వ వార్డులో మధ్యాహ్నం 2:30కు, 41వ వార్డులో 4:30 గంటలకు నీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే, 19న ఉదయం 43వ వార్డులో ఉదయం 6గంటలకు, 44వ వార్డులో 8:30కు, 46వ వార్డులో 11:30కు, 47వ వార్డులో 4:30 గంటలకు ట్యాంకర్లతో తాగు నీరు సరఫరా చేస్తామని చెప్పారు. ఆయా ప్రాంత ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు

గుర్ల: కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు నానా ఇబ్బందులుపడుతున్నారు. ఈపత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ, సచివాలయాల్లో సరిగ్గా ఆన్‌లైన్ కావడం లేదు. కొంతమంది విద్యార్థులు మాట్లాడుతూ సచివాలయం, మీసేవల్లో ఆన్‌లైన్ సరిగా కావడం లేదని, ఎంతో సమయం వెచ్చించి ఆన్‌లైన్ చేసి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు అన్ని పత్రాలు అందజేసినప్పటికీ వాటిని ఆమోదించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుజ్జింగివలసకు చెందిన సుమారు 50 మంది మంది విద్యార్థులు కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాంకేతిక సమ స్య కారణంగా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జాప్యం చేయకుండా అందజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

17న లక్ష కుంకుమార్చన

గజపతినగరం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈనెల17న నిర్వహించనున్నట్లు అర్చకులు రాంబాబు బుధవారం తెలిపారు. ఆరోజు ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, లక్ష కుంకుమార్చన, సాయంత్రం 108 వెండి పుష్పాలతో అష్టోత్తర పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఖాసాపేట రూరల్ ఫీడర్‌లో మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాసాపేట, కొట్యాడ, తలారి, రంగరాయపురం, సంతపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంచాయతీ సెక్రటరీ బదిలీ

భోగాపురం: భోగాపురం మేజర్ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణనాయుడు పదోన్నతిపై(గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1) విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బదిలీ అయినట్టు ఎంపీడీఓ జి.చంద్రకళ బుధవారం తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ మంగం సురేష్‌కు ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు.

జిందాల్ కార్మికులకు అండగా ఉంటాం


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికు లకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యానారాయణ తెలిపారు. ముడుసరుకు కొరత కారణంగా గత నెల 17వ తేదీన ఈ కర్మాగారం లేఆఫ్‌ను ప్రకటించింది.నాటి నుంచి కార్మికులు కర్మాగారం ఎదుట నిరసన తెలుపుతున్నారు.కార్మికులకు సూర్యనారయణ, సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి టి.వి.రమణ బుధవారం తమ సంఘీభావం తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉంటే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చ న్నారు.సమస్యపై ఉన్నతాధికారులకు త్వరలోనే వినతిపత్రాలను అందజేస్తామని చెప్పారు. యాజమాన్యాలు ఉన్నపళంగా కర్మాగారాలను మూసేస్తే కార్మికుల కుటుంబాల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సిద్ధం


గోవిందపురం ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

- నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో సాగు
- సబ్సిడీపై విత్తనాల పంపిణీ

పూసపాటిరేగ: నైరుతి రుతుపవనాల రాకతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రైతులు మెట్ట పంటల సాగుకు ఉపక్రమించారు. ఖరీఫ్ వరి పంట సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు వరి విత్తనాలను అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై విక్రయిస్తున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పూసపాటిరేగ మండలంలో 5,900, డెంకాడలో 5,200, నెల్లిమర్లలో 4,700, భోగాపురంలో 4,500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. పచ్చిరొట్ట ఎరువుల సాగుకు వీలుగా జీలుగ, కట్టి జనుమ, పిల్లి పెసర విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా విక్రయిస్తున్నారు. వరి వంగడాలైన ఎంటీయూ-1121 రకం, బీపీటీ-5204, బీపీటీ-3291, ఎంటీయూ-1224 రకాలను ఆర్‌బీకేల్లో సిద్ధం చేశారు. పూసపాటిరేగ మండలంలో ఎంటీయూ-1121 రకం 840 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 3291 రకం 60 క్వింటాళ్లు, ఎంటీయూ-1224 రకం 20 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ తెలిపారు.

బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

విజయనగరం టౌన్: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని హీల్ ప్రాజెక్టు అధికారిణి తాలాడ దీప్తి పిలుపునిచ్చారు. చెల్లూరు ది లెప్రసీ మెషిన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం, భావిభారత పౌరుల్ని కాపాడుకుందామనే నినాదం మేరకు పిల్లలు బడికి, పెద్దలు పనికి అన్నది ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎమ్.వంశీ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల బాధ్యత అవసరం

నెల్లిమర్ల: భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎంఈఓ యుఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. భవిత కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులను స్కూల్‌కు పంపించే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఈపు విజయ్‌కుమార్, ఎంఆర్‌టీలు బి. అప్పలనాయుడు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయునికి లడ్డూల నైవేద్యం


స్వామివారికి మహాలడ్డూ నివేదన చేస్తున్న కామరాజు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్ వెనుక ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామికి ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం మహాలడ్డూలతో నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కన్వీనర్ పెంటపాటి కామరాజు మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవం పూర్తయిన తర్వాత స్వామివారికి ఏటా మహాలడ్డూను నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సుమారు వెయ్యి లడ్డూలతో స్వామికి నివేదన చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.